క్లుప్తంగా

5న జాతీయ లోక్ అదాలత్



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న శాంతి

చీరాల రూరల్: స్థానిక కోర్టు భవన సముదాయంలో ఈనెల 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ మంగళవారం తెలిపారు. కోర్టులలో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులను రాజీమార్గంలో రాజీ చేసుకున్నట్లయితే సమయంతో పాటు డబ్బు ఆదా చేసుకోవచ్చునని ఆమె సూచించారు. లోక్ అదాలత్‌లో కక్షిదారులిరువురు రాజ మార్గంలో కేసులను రాజీచేసుకుంటే వారు కోర్టులకు చెల్లించిన ఫీజులను తిరిగి వాపసు చేస్తామని చెప్పారు. జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకోదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులైన కొట్లాట కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు, వివాహ సంబంధ కేసులు, బ్యాంకు లావాదేవిలు, ప్రామిసరీ నోటు కేసులను పరిష్కరించుకోవచ్చునని సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కేసులను రాజీ చేసుకోవాలని పేర్కొన్నారు.

పర్చూరు(చినగంజాం): జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఈ నెల 5 వ తేదీన నిర్వహించే కార్యక్రమాన్ని కక్షిదారులు వినియోగించుకునేలా చూడాలని జూనియర్ సివిల్ జడ్జి పీ శాంతి అన్నారు. పర్చూరు కోర్టు భవన సముదాయంలో ఆమె పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ జీ సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రో స్పీడ్ వద్దు.. జీవితం ముద్దు !

- 216 జాతీయ రహదారిలో ప్రమాదాలు
- ప్రాణాలను కబళిస్తున్న వైనం
- మృతుల్లో ఎక్కువ మంది 40 ఏళ్ల లోపువారే
- ఏడాదిలో 10 మందికి పైనే మృత్యువాత



డివైడర్‌ని ఢీకొట్టి మృతి చెందిన యువకుడు (ఫైల్)



డివైడర్‌ని బైక్ ఢీకొట్టడంతో డివైడర్ పగిలిన దృశ్యం

వేటపాలెం: 'వేగం కన్నా ప్రాణాలు మిన్న' అనే మాట మనందరికీ గుర్తున్నా కూడా చాలా మంది పట్టించుకోవడం లేదు. ఫలితంగా రోడ్డు ప్రమాదాల్లో అమూల్యమైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ముఖ్యంగా యువత, మైనర్లు, మద్యం తాగి వాహనాలు నడిపి మృత్యువాత పడుతున్నారు. దీనికి తోడు అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా రోడ్డు నిర్మాణాల్లో లోపాలు, మలుపులు కారణమవుతున్నాయి. 216 జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాలు అధికమయ్యాయి. ప్రమాదాల సంఖ్య ఏటేటా పెరుగుతోందే కాని తగ్గడం లేదు. చేతికందివచ్చిన పిల్లలు రోడ్డు ప్రమాదాల్లో చనిపోతుండటంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోతున్నారు. చెట్టంత కొడుకు ప్రమాదంలో గాయపడి తమ కళ్ల ముందే దివ్యాంగుడిగా మారుతుండటం చూసి తట్టుకోలేకపోతున్నారు.

ఏటా వందల సంఖ్యలో ప్రమాదాలు..

మృతుల్లో 75 శాతం మంది 40 ఏళ్లలోపు వారే కావడం గమనార్హం. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని అప్పుడప్పుడే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్న వారు కూడా మృత్యు కౌగిలిలో చిక్కుపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదాల్లో క్షతగాత్రుల సంఖ్య కూడా తక్కువగా ఉండటం లేదు. హెల్మెట్ లేకపోవడం వల్ల చాలా మంది మృత్యుఒడిలోకి చేరుకుంటుండగా, చాలా మంది కాళ్లు చేతులు విరిగి శాశ్వత దివ్యాంగులుగా మారిపోతుండటం కలచి వేస్తున్న అంశం. ప్రమాదాలకు ప్రధాన కారణం అతి వేగమేనని పోలీసులు నిర్ధారించారు. 150 సీసీ, ఆ పైన సామర్థ్యం కలిగిన వాహనాలను ఎక్కువ మంది యువకులు వాడుతున్నారు. గంటకు 120 నుంచి 140 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తున్నారు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను అంచనా వేయలేకపోవడం, అదుపుతప్పి డివైడర్లను ఢీకొనడంతో మృతి చెందుతున్నారు.

కొన్ని ఘటనలు ఇలా..

■ గత నెలలో వేటపాలెం చల్లారెడ్డిపాలెం కొణిజేటి చేనేతపురి కాలనీకి చెందిన 17 ఏళ్ల యువకుడు బుజ్జిబాబు వేటపాలెం నుంచి చీరాల బైక్ పై వెళ్తున్నాడు. నూలుమిల్లు వద్ద వేగంగా రోడ్డు మధ్య డివైడర్‌ని ఢీకొట్టాడు. యువకుడు అపస్మారక స్థితిలోకి వెళ్లగా చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

■ చీరాలకు చెందిన రాజకృష్ణారెడ్డి బైక్‌పై 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డు మీదుగా వేటపాలెం నుంచి చీరాల వైపు వెళ్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో మృతి చెందాడు.

■ వేటపాలెం కుందేరు ప్రాంతంలో నివాసం ఉండే ఓ యువకుడు వారం రోజుల కిందట బైక్‌పై బైపాస్ రోడ్డు అవతల జబ్బార్ కాలనీలో నివాసం ఉంటున్న తన తండ్రి దగ్గరకు వెళ్లాడు. రాత్రి 9 తిరిగి కుందేరు వద్ద గల తన ఇంటికి వస్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొని మృతి చెందాడు. ఇప్పటికైనా తల్లిదండ్రులు పిల్లలకు బైక్‌లను ఇవ్వకుండా నియంత్రించుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

అతివేగమే కొంపముంచుతోంది..



వేగంగా వెళ్తుండటం వల్లే 80 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయి. యువకులైతే మరీ వేగంగా వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఎన్నో రకాలుగా వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. బైపాస్ కూడళ్లలో వేగ నిరోధకాలు, ప్రమాద ప్రాంతాల్లో సూచికలు ఏర్పాటు చేస్తున్నాం. వేగంగా వెళ్లడం ఫ్యాషన్ అనుకుంటున్నారు. పిల్లలకు సామర్థ్యానికి మించిన బైకులు ఇస్తున్నప్పుడు తల్లిదండ్రులు ఆలోచించాలి.

– జనార్దన్, ఎస్సై, వేటపాలెం

జగన్‌ను కలిసిన యువజన విభాగం నాయకులు



మాజీ సీఎం జగన్‌ను కలిసిన శేషగిరిరావు

పర్చూరు(చినగంజాం): వైఎస్సార్ సీపీ యువజన విభాగం పర్చూరు నియోజకవర్గ నాయకులు మంగళవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలో రాష్ట్ర యువజన విభాగం కార్యవర్గం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు కొల్లా శేషగిరి రావు, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి ఉప్పలపాటి అనిల్ చౌదరిలు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

చీరాల రోటరీకి అవార్డుల ప్రదానం



అవార్డులు అందుకుంటున్న క్లబ్ సభ్యులు

చీరాల: రోటరీ క్లబ్ ఆఫ్ చీరాలకు 5 అవార్డులు, 8 ప్రశంస పత్రాలు అందుకున్నట్లు క్లబ్ ప్రెసిడెంట్ చందలూరి బాల వెంటేశ్వరరావు, కార్యదర్శి నక్కల సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. హైదరాబాద్ కొంపల్లి గౌరిక్ పంక్షన్ హాల్లో జరిగిన రోటరీ అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డులు అదుకున్నట్లు తెలిపారు. 2024-25 సంవత్సరానికి చేసిన సేవా కార్యక్రమాలకు డిస్ట్రిక్ 3150 గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి అసిస్టెంట్ గవర్నర్ తేళ్ల రమేష్ చంద్ర చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారని క్లబ్ కార్యవర్గాన్ని పోలుదాసు రామకృష్ణ, బీఎస్ శంకర్‌రెడ్డి అభినందించారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

వేటపాలెం: చదువుకొనే వయస్సులో యువత మత్తుపదార్థాలు, చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలు పాడు చేసుకోవద్దని ఎస్సై పి జనార్దన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో విద్యార్థులకు మత్తు పదార్థాలు వల్ల జరిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ చదువుకొనే వయసులో చెడు పరిచయాలతో మత్తు పదార్థాలకు బానిసలు కావడం, సమాజంలో విద్రోహ శక్తులుగా మారి వివిధ కేసుల్లోఅరెస్టు అవుతారన్నారు. ఇలా జరిగితే వారికి భవిష్యత్‌లో ఉద్యోగాలకు అనర్హులుగా మిగిలిపోతారని తెలిపారు. బాలికలు ఎలాంటి సైబర్ మోసాలకు గురికాకుండా 1093కి కాల్ చేస్తే రక్షణ కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారంచేడు: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణను అలవర్చుకొని జీవితాలను సరైన మార్గంలో ఉంచుకోవాలని కారంచేడు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు మోడ్రన్ స్కూల్ ఆవరణలో విద్యార్థులకు సమాజం పట్ల అవగాహన కల్పించారు. నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలై తమ జీవితాలను ఎలా నాశనం చేసుకుంటున్నారో ఆయన వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సరోజినీ, పావులూరి శ్రీనివారావు, మహాలక్ష్మమ్మ, పద్మావతి, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కనిపించే వైద్యులు దేవుళ్లతో సమానం



రామచంద్రనగర్‌లో ఉపాధ్యాయుడిని పరీక్షిస్తున్న చిన్నారులు



కారంచేడులో డాక్టర్స్ డే వేడుకల్లో వైద్యులు, సిబ్బంది

- ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

కారంచేడు/పర్చూరు(చినగంజాం)/చినగంజాం: ప్రాణాలు కాపాడే వైద్యులు దేవుళ్లతో సమానమని వక్తలు పేర్కొన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రం కారంచేడు పీహెచ్‌సీలో వేడుకలు నిర్వహించారు. మనిషికి దేవడు ప్రాణం పోసి జన్మనిస్తే, వారు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు వైద్యులు వైద్య సేవలు అందించి పునః జన్మనిస్తారన్నారు. అనంతరం వైద్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోరంట్ల సురేష్‌బాబు, వైద్యులు పృథ్వీరాజ్, ఉషలు వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

■ ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యుడు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పశ్చిమ బెంగాల్ రెండో ముఖ్యమంత్రి డాక్టర్ బిదాన్ చంద్రరాయ్ సమాజానికి ఉత్తమ వైద్య సేవలు అందించినందుకుగాను ఆయన జయంతి పురస్కరించుకొని డాక్టర్స్‌డేగా జరుపుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రుతి, ఆశా వర్కర్‌లు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేటపాలెం డాక్టర్ రామానుజంను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

■ చినగంజాం మండలంలోని రామచంద్రనగర్ ప్రాథమిక పాఠశాలలో డాక్టర్స్ డే నిర్వహించారు. ఐదో తరగతి విద్యార్థినులు వాటుపల్లి ఆరిఫా, కొక్కిలగడ్డ లాస్య, దండుప్రోలు భావ్యశ్రీలు రోల్ ప్లే చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించే విధానాన్ని వివరించారు.

వేటపాలెం: వైద్యులు దేవునితో సమానమని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏవీ సురేష్ పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ డాక్టర్స్‌డే సందర్భంగా రామానుజం, దివి చక్రవర్తి, కారంచేటి శివరామకృష్ణలను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు బట్ట మోహన్‌రావు, వాసు, అక్కల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

చీరాల రూరల్: జాతీయ వైద్యుల దినోత్సవం సంధర్భంగా పట్టణంలోని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ నోవా అజయ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. డాక్టర్ అజయ్‌కుమార్ కొత్తగా ఆస్పత్రి స్థాపించి రోగులకు కేవలం రూ. 10 లకే ఓపీ చూస్తు వైద్య సేవలందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు మాచవరపు జూలియన్, పులిపాటి బాబురావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఎస్ఆర్‌అండ్‌పిఎం హైస్కూలు క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులు ఇస్తర్ల బాబురావు, ఎ. శంకర రెడ్డి, డేగల శ్రీనివాస్, మేడికొండ అబ్రహం బ్లెస్సీ, ఎంవీ రమణరావు, డాక్టర్ సజ్జలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్, ఐ. సుభాషిణీ, నారాయణమూర్తి పాల్గొన్నారు.

సముద్రతీర ప్రాంతాల్లో ఇసుక తవ్వితే కఠిన చర్యలు



ఇసుక తవ్వకాలపై స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకరరావు

చినగంజాం: సముద్ర తీరప్రాంతంలో ఇసుక తవ్వకాలు జరిపితే అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన చినగంజాం మండల పరిధిలోని పల్లెపాలెం పంచాయతీ పరిధిలోని బాపయ్య నగర్ సముద్ర తీరప్రాంత భూములను పరిశీలించారు.

సముద్ర తీరంలో కొందరు వ్యక్తులు బహిరంగంగా కోస్టల్ జోన్ పరిధిలోని ఇసుకను అక్రమంగా తవ్వి తీసుకెళుతున్న తీరును వ్యతిరేకిస్తూ స్థానిక మత్స్యకారులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో ఆయన ఆకస్మికంగా వెళ్లి తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆర్ఐ దానియేలు, వీఆర్ఏ సుబ్బారావు, స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

ఆటో-కారుఢీ ఇద్దరికి గాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లు గాయాలపాలయ్యారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో మార్టూరులో జరిగింది. హైవే మొబైల్ సిబ్బంది రవి వివరాల మేరకు.. ఉలవపాడు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన కొమెర రవి చిలకలూరిపేట నుంచి ఒంగోలు వైపు ఆటోలో వెళ్తున్నాడు. అదే మార్గంలో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మండరం రేవంత్ కారు నడుపుకుంటూ నెల్లూరు వైపు వెళ్తున్నాడు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురు రహదారిపై ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి రేవంత్ కారుతో ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో బలంగా ఢీకొట్టాడు. ప్రమాద ధాటికి రెండు వాహనాల్లోని డ్రైవర్లకు గాయాలు కావడంతో పాటు కారు తీవ్రంగా ధ్వంసమైంది. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఇరువురిని చికిత్స నిమిత్తం చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



రక్తగాయాలతో పడిపోయిన సాంబయ్య

మేదరమెట్ల: బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల దక్షిణబైపాస్ సమీపంలో మంగళవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. యద్దనపూడి నుంచి ఒంగోలుకు మోటారు బైకుపై వెళ్తున్న వ్యక్తి కొరిశపాడు మండలం మేదరమెట్ల దక్షిణబైపాస్ సమీపంలో గల భ్రమర టౌన్‌షిప్ వద్దకు రాగానే బైకు అదుపుతప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న సాంబయ్యకు రక్తగాయాలు కాగా స్థానికులు చికిత్స కోసం వైద్యశాలకు తరలించారు.

జాతీయ సమ్మె జయప్రదం చేయాలి

అద్దంకి: కార్మిక వ్యతిరేక చట్టాలను తెస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం అద్దంకిలో ఉన్న అన్ని బ్యాంకుల్లో, ఎల్ఐసీ కార్యాలయాల్లో కరపత్రాలు పంచుతూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు కెఎల్‌డీ ప్రసాద్, ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి జే శివ నాయక్ పాల్గొన్నారు.

పర్చూరు రోటరీ క్లబ్ కొత్త కార్యవర్గం ఎన్నిక

పర్చూరు(చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ 2025-26 వ సంవత్సరం కొత్త కార్యవర్గం ఎన్నిక మంగళవారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులుగా తోకల కృష్ణమోహన్ రెండో సారి తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కోమటి ఆంజనేయులు, కోశాధికారిగా పంబి సదానందరెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో చర్చించి బాధ్యతలను తీసుకున్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీలతో అదనపు ఆదాయం

యద్దనపూడి: గ్రామాలను చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పీటీవీ కృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని పోలూరు గ్రామంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను పరిశీలించారు. చెత్తను రోడ్డు పక్కన వేయకుండా పంచాయతీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తడి,పొడి చెత్తను విడివిడిగా శానిటేషన్ సిబ్బందికి ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం శానిటేషన్ సిబ్బందిని అడిగి డోర్ టూ డోర్ కలెక్షన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్కౌట్స్‌తో సమాజసేవ



స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లతో ఉపాధ్యాయులు

చినగంజాం: స్కౌట్స్ వలన సమాజ సేవ చేసే అవకాశం కలుగుతుందని చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సభ్యులు కావడం వలన సమాజ సేవ చేసే అవకాశంతో పాటు ఉన్నత చదువులలో సీట్లు సాధించడానికి అవకాశం ఉందని తెలియజేశారు. స్కౌట్స్ టీచర్‌గా రామకోటిరెడ్డి, గైడ్స్ టీచర్‌గా జ్యోతి వ్యవహరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎన్‌సీసీ అధికారి ఎస్ నరసింహారావు, స్కూల్ అసిస్టెంట్ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నిరసన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

చీరాల: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం సీఐటీయూ ఆధ్వర్యంలో కోసం మొకాళ్లపై మంగళవారం నిరసన కార్యక్రమ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి చిమటా వీరాస్వామి మాట్లాడుతూ రాష్ట్ర వాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు న్యాయమైన ప్రభుత్వ వాగ్దానం ఇచ్చిన సమస్యల పరిస్కారం కోసం దశలవారి ఆందోళనలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, పీ సురేష్, కొండయ్య పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుతో లాభాలు



అద్దంకిలో మాట్లాడుతున్న ఏవో

అద్దంకి: మండలంలో ఈ ఏడాది పొగాకు సాగు చేయవద్దని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ కౌలు రైతులు పంట సాగు ధ్రువీకరణ పత్రాలు పొందాలని సూచించారు. పొగాకు బదులు అపరాలు సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ, విస్తరణ అధికారి తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ: ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సమాయత్తంతో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వ్యవసాయాధికారి పీ. శ్రీనివాసరావు కోరారు. మంగళవారం గుంటుపల్లి, బల్లికురవ గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. భూసార పరీక్షలు ఆధారంగా పంట సాగు చేపట్టాలన్నారు. పొగాకు సాగుకు చెక్‌పెట్టి మొక్కజొన్న, పత్తి, కంది, కొర్రలు సాగు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో మౌలాలి, వీఏఏలు ప్రవీణ్, ఆదర్శ్ పాల్గొన్నారు.

మార్టూరు మండల పొగాకు రైతులకు పంగులూరు ఏఎంసీలో విక్రయాలు



కౌలు రైతు కార్డులు అందజేస్తున్న ఏవో లావణ్య

మార్టూరు: మండలంలో నల్లబర్లీ పొగాకు సాగు చేసి రిజిస్టర్ చేసుకున్న రైతులు తమ ఉత్పత్తులను షెడ్యూల్ ప్రకారం పంగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించి విక్రయించుకోవాలని ఏవో రామినేని లావణ్య తెలిపారు. మండలంలోని బబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాల రైతులతో మంగళవారం ఆమె మాట్లాడారు. రిజిస్టర్ చేసుకున్న రైతుల ఫోనుకు అధికారులు పంపిన మెసేజ్ ప్రకారం ఆయా తేదీల్లో మాత్రమే రైతులు తమ పొగాకు చెక్కులను పంగులూరు ఏఎంసీకి తరలించుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల అధికారి రాజశేఖర్, వీఏఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లను సరిచేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



కిందపడిన వైర్లను సరిచేస్తున్న విద్యుత్ సహాయకుడు

బల్లికురవ: పొలాల్లో తెగికిందపడిన త్రీఫేజ్ విద్యుత్ సరఫరానిచ్చే సప్లయ్ వైర్లను మంగళవారం ఆశాఖ అధికారులు సరిచేశారు. ఆదివారం సాక్షిలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు అన్న శీర్షికతో ఏఈ కె. శ్రీనివాసరావు స్పందించారు. మండలంలోని సూరేపల్లి గ్రామానికి తూర్పు వైపున చంటి శ్రీనివాసరెడ్డి పొలం నుంచి చావలి వెంకట్రావు పొలం వరకు ఉన్న విద్యుత్ లైన్‌లో ఇటీవల వర్షాలు, ఈదురు గాలులకు వైర్లు తెగి కిందపడిన విషయం విదితమే. కింద పడిన వైర్లు సరిచేయటంతో పాటు ఆ ప్రాంతంలో దెబ్బతిన్న పోల్‌ను సరిచేశారు. ఏఈ శ్రీనివాసరావు, గ్రామ విద్యుత్ సహాయకుడు రమేష్, సాక్షికి సూరేపల్లి గ్రామ రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.